క్లుప్తంగా

వసతిగృహం సందర్శన



గట్టు: కలెక్టర్ ఆదేశాల మేరకు గట్టులోని సాంఘిక సంక్షేమ ఎస్సీ వసతి గృహాన్ని గురువారం రాత్రి ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, గిర్దావర్ రాజు సందర్శించారు. విద్యార్థులతో వారు మాట్లాడి వసతి గృహంలో చోటు చేసుకున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వసతి గృహం చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని వార్డెన్‌కు సూచించారు.

వర్షం కోసం దర్గాలో ప్రార్థనలు

అయిజ: మండలంలోని కిష్టాపురం గ్రామంలో గురువారం అలీసాహెబ్ దర్గా వద్ద భక్తులు వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తుంగభద్ర నది నుంచి గుర్రంపై గంధంతో పాటు నదీ జలాన్ని తీసుకొచ్చి దర్గాను శుద్ధి చేశారు. దర్గా వద్ద పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామ ప్రజల నమ్మకం.

తిమ్మప్పస్వామి జాతర



అయిజ: పట్టణ శివారులోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో నిర్వహించే జాతరకు సంబంధించి మెదటి రోజు గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కల్యాణం జరిపించేందుకు పందిరి వేశారు. అందుకు సంప్రదాయపరంగా పుట్టకు పూజలు చేశారు. పుట్ట మన్ను తెచ్చి స్వామివారి కల్యాణానికి పందిరిని అలంకరించారు. అనంతరం వేదమంత్రాలతో హోమం నిర్వహించారు. రాత్రి శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు.

బైక్, కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



మల్దకల్: ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మండల కేంద్రం సమీపంలో ఉన్న వైకుంఠధామం వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప తన సొంత అవసరాల నిమిత్తం మల్దకల్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో గద్వాల నుంచి అయిజకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో బోయ తిమ్మప్ప తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి పెద్దపోతులపాడు వరకు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలను గురువారం చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీప్రసూన సొంత ఖర్చులతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రోడ్డు గుండా విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారని, గుంతలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అందుకే గుంతలను మట్టితో పూడ్చివేస్తున్నామని తెలిపారు. రోడ్డు గుంతలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఉన్నతాధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం

అయిజ: మున్సిపాలిటీ, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని ఎస్‌ఐ శ్రీనివాసరావుకు పర్దిపురం గ్రామస్తులు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఈ నెల 16న మండలంలోని బింగుదొడ్డి, మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 17, 20 తేదీల్లో ఉత్సవ విగ్రహం ఊరేగింపు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈరన్న, పరశు, రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే!

- నిత్యం పరీక్షలు, వాహనాల తనిఖీలు
- మద్యం తాగి వాహనం నడిపితే సీజ్
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



నందిన్నెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు (ఫైల్)

కేటీదొడ్డి: రోడ్డు ప్రయాణాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానాలుప విధిస్తూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు పోలీసులు.

ఈ– చలాన్లు

గతంలో ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలు నడిపితే సంబంధిత పత్రాలు అడిగి జరిమానా వేసేవారు. ఇప్పుడు ఫొటోలు తీసి జరిమానా వేసి ఈ–చలాన్లు ఇంటికి పంపుతున్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్లకు కలర్ రుద్దడం, లేదంటే నంబర్ ప్లేట్ తీసి వేయడం వంటి పనులు చేస్తున్నారు. ఇటువంటి వాటిపై కఠినంగా ఉంటున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని వాహనాల వెంట అన్ని



నందిన్నె అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

పేపర్లు పెట్టుకొని లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని చెబుతున్నారు. హెల్మెట్ వాడకపోవడం, డ్రంకెన్ డ్రైవ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

రూ. 5.35 లక్షలు జరిమానా

మండలంలో 2024 నుంచి 2025 వరకు ఇప్పటి వరకు 910 వాహనాలకు వివిధ కేసుల్లో రూ. 5.35 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అదే విధంగా రోడ్డు నిబంధనలపై మండల కేంద్రాలు, చెక్‌పోస్టులు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

జరిమానా ఇలా

మద్యం తాగి వాహనం నడిపితే రూ. 2 వేలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌కు రూ.వెయ్యి, నంబర్ ప్లేట్ లేకుంటే రూ.200, లైసెన్స్ లేకుంటే రూ. 500, ఓవర్ లోడ్‌కు రూ.వెయ్యి ఇన్సూరెన్స్ లేకుంటే రూ. వెయ్యి, హెల్మెట్ ధరించని వారికి రూ.వెయ్యి వరకు జరిమానా వేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులు ప్రజలు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని, ప్రయాణాలు చేసేటప్పుడు తమ కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పించాలి



పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే బాగుంటుంది. చాలామంది తెలియకపోవడం నిబంధనలు పాటించడంల లేదు. జరిమానాల గురించి అవగాహన కల్పిస్తే మార్పు వస్తుంది.

\- ఎల్లప్ప, కేటీదొడ్డి

నిబంధనలు పాటించాలి



మద్యం మత్తులో వాహనం నడిపితే ప్రమాదంలో పడడమే కాకుండా ఇతరులకు ప్రాణాలకు కూడా హాని కలుగుతుంది. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. వాహన తనిఖీల్లో పట్టుబడిన వారికి కేసు తీవ్రతను బట్టి శిక్షలు ఉంటాయి.

\- శ్రీనివాసులు, ఎస్‌ఐ, కేటీదొడ్డి

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని బీజేపీ స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ప్రభుత్వం ద్వారా గ్రామాలకు అందిన పథకాల గురించి వివరించారు. గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్లు, వీధి లైట్లు, నూతన భవనాలు కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేసిందన్నారు. రైతుల కోసం కిసాన్ సమ్మాన్ ద్వారా బ్యాంకు ఖాతాలో రూ.ఆరు వేలు జమ చేస్తుందని తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా టాయిలెట్స్, డ్రైనేజీల ఏర్పాటు, జీవనోపాధి కోసం విశ్వకర్మ, ముద్ర రుణాలు ఇచ్చి ఉపాధి



అవగాహన కల్పిస్తున్న నాయకులు

కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి రాష్ట్రంలో గద్దెనెక్కిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరిన్ని కల్లబొల్లి మాటలు చెప్పి మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ నాయకుడు రాజు గౌడ్, భగత్‌రెడ్డి, నర్సింహారాజు గౌడ్, వెంకటరాములు, రాఘవేంద్ర, రాములు, శ్రీనువాసులు, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామాలుగా మార్చాలి

రాజోళి: గ్రామాలను క్షయ రహితంగా మార్చాలంటే కలిసికట్టుగా ముందుకు సాగాలని టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో టీబీ ముక్త భారత్ అభియాన్ ద్వారా టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులను ఎవరైనా దత్తత తీసుకుని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది 60 మందికి పైగా స్క్రీనింగ్, ఎక్స్‌రేలు చేసి వ్యాధి లక్షణాలు గుర్తించారు. వ్యాధి నిర్ధారణ చేసిన అనంతరం వారికి మందులు, ఆరోగ్యంపై సూచనలను అందించారు. కార్యక్రమం



ఫ్లకార్డులు చూపుతున్న ఆశా కార్యకర్తలు

లో మెడికల్ ఆఫీసర్ మధుబాబు, సూపర్‌వైజర్ హెలెన్, రంజిత్‌కుమార్, చంద్రమోహన్, రామకృష్ణ, గురుబసయ్య, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

అయిజ: మండలంలోని కొత్తపల్లికి చెందిన కుర్వ రంగస్వామి గురువారం కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. పట్టణంలోని నిర్మానుష్య ప్రదేశంలోకి వెళ్లి అతడి అన్న వినోద్‌కు వీడియో కాల్ చేసి, ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నానని చెప్పాడు. వినోద్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం చేరవేశాడు. స్పందించిన పోలీస్ కానిస్టేబుల్ రవి వెంటనే లొకేషన్ తెలుసుకొని రంగస్వామి చేతిలో ఉన్న పురుగుల మందు డబ్బాను లాక్కున్నాడు. అతడి బంధువులకు సమాచారం ఇచ్చి వెంటనే ఆస్పత్రికి పంపించారు.



యువకుడిని కాపాడిన కానిస్టేబుల్

హద్దురాళ్లు సరిచేయాలి

ధరూరు: మండలంలోని రేవులపల్లి ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ప్లాట్ల హద్దురాళ్లు సరిచేయాలని గ్రామస్తులు గురువారం తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 99 ప్లాట్ నుంచి పట్టా సర్టిఫికెట్, లేఅవుట్ మ్యాప్ ఉన్నా.. పొజిషన్‌లో హద్దురాళ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 324 ప్లాట్లు మంజూరైనా హద్దురాళ్లు లేకపోతే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిలిచిపోతుందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ రాఘవ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని అమరవాయిలో పర్యటించిన ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు

అయిజ: స్థానిక తహసీల్దార్ ఎస్.జ్యోతి ఈ నెల 20 వరకు సెలవుపై వెళ్లగా.. ఆమె స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.ధరణిషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ. నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తానని, రెవెన్యూకు సంబంధించిన సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన కోడిపుంజు 'పంచాయితీ'

మల్దకల్: అయిజ–గద్వాల ప్రధాన రహదారిపై అమరవాయి స్టేజీ వద్ద గురువారం ఆర్టీసీ ప్రైవేటు బస్సు కింద పడి ఓ కోడిపుంజు మృతి చెందింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తమ కోడిపుంజు మృతి చెందింటూ కోడి యజమని రుక్మాత్‌బేగ్, గ్రామస్తులు బస్సును రోడ్డుపై 15 నిమిషాల పాటు నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలియచేయడంతో పోలీసులు అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. కోడిపుంజుకు రూ.వెయ్యి నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరగా అందుకు బస్సు డ్రైవర్ నిరాకరించడంతో ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

భక్తిశ్రద్ధలతో జీవేశ్వరస్వామికి పూజలు

గద్వాలటౌన్: స్వకులసాలి సమాజ్ మూల పురుషుడు భగవాన్ శ్రీ జిహ్వేశ్వర జయంతి ఉత్సవాలను స్వకులసాలి సమాజ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వేదనగర్‌లో వైభవంగా చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళా మండలి సభ్యులు శ్రీజిహ్వేశ్వర నామకరణ నిర్వహించారు. అనంతరం స్వకులసాలి సమాజ్, మహిళా మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 60 ఏళ్లు పైబడిన చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు.

రాజోళి: మండల కేంద్రంలో జీవేశ్వరస్వామి జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సకుల సాలే కులస్తులు తుంగభద్ర నది నుంచి పవిత్ర జలాన్ని తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం, అష్టోత్తరం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాఘవేంద్ర, మల్లేష్, లోకేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో జిహ్వేశ్వర రథోత్సవంలో పాల్గొన్న స్వకులసాలీలు



రాజోళిలో..

గట్టు: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ వీరన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని, చేనేత కార్మికులకు చేయూతను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు చంద్రశేఖర్, కూనె ఈరన్న, నర్సింహులు, లక్ష్మన్న, శివాజీ సురేష్, శివుడు, పూజారి ఈరన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు ఆగం

మల్దకల్: ప్రజలు మత్తు పదార్థాలను వినియోగిస్తే జీవితాలు ఆగమవుతాయని సీసీఎస్ ఎస్‌ఐ కేశవరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పాల్వాయి గ్రామంలో సీసీఎస్ ఎస్‌ఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే చిన్నారులు చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహాస్వామి, కానిస్టేబుల్ రాజు, చిట్టెమ్మ, సరోజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ ఎస్‌ఐ కేశవరావు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

గద్వాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు పాత బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటస్వామి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పుర ప్రజలకు సేవలు అందస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీంతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేతనం అందించాలని కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా ప్రభుత్వం కార్మికుల శ్రమదోపిడి చేస్తుందని మండిపడ్డారు. పీఎఫ్‌ను మున్సిపాల్ కార్మికుల ఖాతాలో సక్రమంగా జమ చేయడం లేదని, ఈఎస్‌ఐ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షుడిగా ఉప్పేర్ నర్సింహ, అధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా రవితో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గట్టన్న, మహేష్‌కుమార్, సువార్తమ్మ, యశోదమ్మ, తిరుపతమ్మ, రాజు, అబ్బు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ



నందిన్నె స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామంలో రాఘవేంద్ర పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేసి, బస్సుల ఫిట్‌నెస్ ఆర్‌టీఓ పర్మిషన్, డ్రైవర్ లైసెన్స్ ఉన్నాయా లేదా అని పాఠశాల కరస్పాండెంట్ రాఘవేంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గువ్వలదిన్నె, వాగుతండా, నందిన్నె పాఠశాలను తనిఖీ నిర్వహించి మధ్యాహ్న భోజనం పరిశీలించి, హాజరు పట్టికను చూసి విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు యుగంధర్, శివరాజ్, పాపయ్య, అనిత, జ్యోతి, గీతాంజలి తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

గట్టు: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ప్రైవేటు స్కూల్ బస్సు కండిషన్ సరిగా లేదంటూ ఆందోళనకు దిగారు. విద్యార్థులను తీసుకెళ్లడానికి గద్వాల నుంచి వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సును విద్యార్థుల తల్లిదండ్రులు ఆలూరులో నిలిపి వేసి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజు గద్వాలలోని ప్రైవేటు స్కూల్‌కు వెళ్తున్న బస్సు విద్యార్థులను తిరిగి ఇంటికి తీసుకొచ్చే క్రమంలో తరచూ మార్గ మధ్యలో ఆగిపోతుందని, అక్కడి నుంచి విద్యార్థులను తాము ఇంటికి తీసుకు రావాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోయారు. కండిషన్ ఉన్న బస్సును నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.



ఆలూరులో స్కూల్ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నులి పురుగుల నివారణకు కృషి చేద్దాం

మల్దకల్: నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ స్వరూపరాణి, సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గురువారం మల్దకల్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 11 నుంచి 18 వరకు చేపట్టనున్న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, సూపర్‌వైజర్ వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరాణి

రాఖీతో సోదరభావం పెంపొందుతుంది

శాంతినగర్: రాఖీ కట్టడం ద్వారా విద్యార్థుల్లో సోదరభావం పెంపొందుతుందని స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనర్సమ్మ అన్నారు. ముందస్తు రాఖీ వేడుకల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలను బాలురకు కడుతూ వేడుకలు నిర్వహించారు. నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష అంటూ ఆనందంగా రాఖీ వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, ఒ.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



సోదరభావంతో బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు

స్పాట్ అడ్మిషన్లు

శాంతినగర్: వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించి భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆగస్టు 11 లోపు ధృవపత్రాలను కళాశాలలో అందజేసి అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 99592 15658, 98492 39840 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గురువారం ఉదయం ఆయన మండలంలోని భీంపురం, ఉప్పేరు గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమయానుకూలంగా పాఠశాలలకు హాజరు కావాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనిందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు.




జోరు వాన



అండర్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పోతులపాడు, మానవపాడు గ్రామాల శివారు ప్రాంతాల్లో గురువారం కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు నిలిచింది. దీంతో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



మానవపాడు-చెన్నిపాడు బ్రిడ్జిపై పారుతున్న వాగు